కాసానిని గెలిపించి తీరుతాం

బీసీ వ్యతిరేకి కాంగ్రెస్‌కు బుద్ధి చెపుతాం

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతిని కాంక్షించే బీఆర్ఎస్‌కే మా మద్దతంటున్న బీసీ నేతలు

ఆది నుంచి కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల వివక్షత చూపుతూ వస్తున్నదని బీసీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అధికారంలో ఉన్నామన్న అహంకారంతో ఇష్టం వచ్చినట్లుగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతుండడం పట్ల బీసీ నేతలు మండిపడుతున్నారు. బీసీలకు న్యాయం చేయకపోగా.. దమ్ముంటే బీసీ అభ్యర్థిని గెలిపించుకోవాలని రెచ్చగొట్టేలా కాంగ్రెస్ పార్టీ నేతలు మాట్లాడడం సమంజసం కాదని నేతలు పేర్కొంటున్నారు. ఇకనైనా బీసీలు మేల్కొనాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా పలువురు నేతలు గుర్తు చేస్తున్నారు. ఈసారి గెలిపించుకోకుంటే.. రానున్న రోజుల్లో ఏ ఎన్నికల్లోనూ బీసీలకు టికెట్ ఇచ్చేందుకు ఏ రాజకీయ పార్టీ ముందుకు రాదని హెచ్చరిస్తున్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతిని కాంక్షించి బీసీ అభ్యర్థికి టికెట్ ఇచ్చిన బీఆర్ఎస్‌కు తమ మద్దతు అని పలువురు నేతలు ఘంటాపథంగా చెబుతున్నారు. ఇదే స్ఫూర్తితో పార్టీలకతీతంగా అన్ని కుల సంఘాలు ఏకతాటిపైకి వచ్చి కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిస్తున్నారు. బీసీలు తల్చుకుంటే ఏదైనా సాధిస్తారని ఈ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపించడం ద్వారా నిరూపించాలన్నారు.

- రంగారెడ్డి, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ)

బీసీల దమ్మేంటో చూపిస్తాం

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. బడుగులను చులకనగా చూస్తున్న పార్టీ కాంగ్రెస్. ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. బీసీల ఐక్యతను చాటుతాం. జనాభాలో మెజార్టీగా ఉన్న బీసీల సత్తా చూపెడతాం.

– నర్సింహులు, పర్వతాపూర్, తాండూరు

కాసాని గెలుపే ధ్యేయం

చేవెళ్ల పార్లమెంట్ స్థానాన్ని ముదిరాజ్ బిడ్డ కాసానికి కేటాయించడం హర్షణీయం. గతంలో ఎంపీగా గెలిచిన వ్యక్తి ఆస్తులను కాపాడుకునేందుకు కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యాడు. కానీ కాసాని కేవలం బీసీల ఐక్యత కోసం తన జీవితాంతం పోరాటం చేస్తూనే ఉన్నారు. బీసీ బిడ్డ కాసానిని భారీ మెజార్టీతో గెలిపిస్తాం.

– శివరామ్, జినుగుర్తి, తాండూరు

బీసీలంతా ఒక్కటవుతారు

బీసీలంగా ఏకతాటి పైకి వచ్చి కాసానిని అధిక మెజార్టీతో గెలిపించుకుంటాం. కాంగ్రెస్ అధికారం చేపట్టిన కొన్ని రోజులకే ఆ పార్టీ నేతలు అహంకార ధోరణితో విర్రవీగుతున్నారు. బీసీలకు బీఆర్ఎస్ అధినేత పెద్దపీట వేశారు. జనాభా లెక్కన చూసిన కూడా బీసీలమే అధిక శాతం ఉన్నాం. తప్పకుండా జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటాం.

– బీర్బల్, మైతాబ్‌ఖాన్‌గూడ, నవాబుపేట మండలం

బీసీల గళం వినిపించాలి

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతోకాలంగా కృషిచేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌కే మా మద్దతు. బీసీల గళం వినిపించాల్సిన సమయం వచ్చింది. కాంగ్రెస్ నాయకులు ఊసరవెల్లిలా రంగులు మారుస్తారే తప్ప న్యాయం చేయరు. బీసీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసి సరైన న్యాయం చేసింది. కాసానిని గెలిపించుకుందాం.

– రాఘవేందర్ ముదిరాజ్, పులుమామిడి, నవాబుపేట మండలం

మా విలువ తెలిసేలా చేస్తాం

కాంగ్రెస్ పార్టీకి బీసీల బలమెంటో తెలిసేలా చేస్తాం. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌కు బీఆర్ఎస్ పార్టీ అవకాశం కల్పించడం మంచి విషయం. ఐకమత్యంతో జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి గెలిపించుకుంటాం. కాంగ్రెస్‌వాళ్లు ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. కాంగ్రెస్ పార్టీ పతనం చూడటమే మా లక్ష్యం.

– కృష్ణయాదవ్, కృష్ణా కాలనీ అధ్యక్షుడు, మాదాపూర్

జ్ఞానేశ్వర్ విజయానికి కృషి చేస్తాం

పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ నాయకుడు జ్ఞానేశ్వర్ ముదిరాజ్ విజయానికి కృషి చేస్తాం. బీసీలకు దమ్ము, ధైర్యం ఉంటే కాసానిని గెలిపించుకోండి చూస్తాం అంటూ ఓ నాయకుడు సోషల్ మీడియాలో సవాల్ చేశాడు. ఈ విషయాన్ని బీసీలందరూ గమనించి బీసీ నేత కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుని మన సత్తా చాటుదాం.

– ఎడ్ల ఉదయ్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు, కందుకూరు

బీసీ కులాల ఐక్యత చాటుతాం

ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ గెలుపునకు కృషిచేస్తాం. ఉమ్మడి రాష్ట్రంలోనే జ్ఞానేశ్వర్ బీసీ కులాలను ఏకం చేసి రాజకీయ చైతన్యం కల్పించారు. బీఆర్ఎస్ అగ్ర కులాల నాయకులకు టికెట్ ఇవ్వకుండా ఓ బీసీ నాయకుడికి టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉన్నది. కాసానిని అధిక మెజార్టీతో గెలిపించి బీసీ కులాల ఐక్యత చాటుతాం.

– ఎం.రాములు, పూడూరు మండలం

కాసానికి టికెట్ ఇవ్వడం అభినందనీయం

కాసాని గతంలో ఉమ్మడి జిల్లా అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచారు. అలాంటివారు పార్లమెంట్‌లోకి వెళ్తే నిరుపేదల సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. బీసీ నాయకుడికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వడం అభినందనీయం. అధికారం కోసం పార్టీలు మారినవారికి సరైన బుద్ధి చెప్పాలి.

– హన్మంత్, కడ్మూర్, పూడూరు మండలం

మన ఓట్లు మన నాయకుడికే వేసుకుందాం

ఎన్నికల్లో కాసాని గెలుపొందడం ఖాయం. గతంలో చేవెళ్ల నుంచి ఇద్దరు నాయకులు ఎంపీగా గెలుపొంది తమ సొంత ప్రయోజనాల కోసం ఇతర పార్టీలోకి వెళ్లారు. బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి మన ఓట్లు మన నాయకుడికే వేసుకుందాం. ఎంపీగా జ్ఞానేశ్వర్ గెలుపొందితేనే పార్లమెంట్‌లో బీసీల సమస్యలపై పోరాటం చేస్తారు.

– కుమ్మరి దర్శన్, బీసీ సెల్ నాయకుడు, షాబాద్ మండలం

బీసీలను ఏకం చేసిన నాయకుడు కాసాని

రాష్ట్రంలో 96 కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సమస్యలపై పోరాటం చేసిన ఘనత కాసాని జ్ఞానేశ్వర్‌కే దక్కుతుంది. అలాంటి నాయకుడిని గుర్తించిన కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం గొప్ప పరిణామం. బీసీల సమస్యలు పరిష్కారం కావాలంటే కాసాని ఎంపీగా గెలవాల్సిందే. మన సత్తా చాటాల్సిందే.

– కారు చెన్నయ్య, బోడంపహాడ్, షాబాద్ మండలం

బీసీ అభ్యర్థికి మద్దతుగా నిలుస్తాం

కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీలను చిన్నచూపు చూస్తే ఊరుకునేది లేదు. మా బలమేంటో అర్థమయ్యేలా చేసి చూపిస్తాం. బీసీ హక్కుల కోసం పాటుపడే నాయకుడు బీసీ అభ్యర్థి కాసానిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం. బడుగు బలహీన వర్గాలను అణగదొక్కేందుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను అడ్డుకుంటాం.

– రాంచందర్, ఇజ్జత్‌నగర్ వార్డు సభ్యులు, మాదాపూర్

బీసీల గళం వినిపిద్దాం

బీసీల గళం వినిపించాల్సిన సమయం వచ్చింది. ఐక్యగా ఉండి ఎన్నికల్లో వెనుకబడిన వర్గాల అభ్యర్థులకు అండగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉన్నది. కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి బీఆర్ఎస్ టికెట్ ఇచ్చి ఆ వర్గాలపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కాంగ్రెస్ వక్రబుద్ధికి సమయం చెప్పాల్సిన అవసరం ఉన్నది.

– జయమ్మ రాజు, శాలివాహన సంఘం రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తా

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

మన్సూరాబాద్, ఏప్రిల్ 16: నాగోల్ డివిజన్ పరిధి అయ్యప్పకాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి కాలనీలో నెలకొన్న యూజీడీ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. వనస్థలిపురం, మన్సూరాబాద్ డివిజన్, బీఎన్‌రెడ్డినగర్, హయత్‌నగర్ డివిజన్ల పరిధిలోని వందలాది కాలనీల డ్రైనేజీ, వర్షపునీరు అయ్యప్పకాలనీ నుంచి వెళ్లే యూజీడీ పైపులైన్ ద్వారా దిగువకు వెళ్తుందని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండటం వలన అధికారులు ఇతర పనుల్లో బిజీగా ఉన్నారని ఎన్నికల అనంతరం కాలనీలో నెలకొన్న సమస్యను పరిష్కరింపజేస్తానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింహచారి, రవికాంత్‌శర్మ, సుదర్శన్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి పూజలు

చంపాపేట,ఏప్రిల్ 16: చంపాపేట డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్‌లోని శ్రీ ధ్యానాంజనేయ స్వామి ఆలయాన్ని మంగళవారం మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సందర్శించారు. గణపతి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ధ్యానాంజనేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి ముడుపు కట్టి మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు గోగిరెడ్డి అంజిరెడ్డి, మేక సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ చంపాపేట డివిజన్ అధ్యక్షుడు ముడుపు రాజ్‌కుమార్‌రెడ్డి, ఎల్బీనగర్ యూత్‌వింగ్ అధ్యక్షుడు రవిముదిరాజ్, సింగంశెట్టి నందు, మాజీ ధర్మకర్త చేగోని మల్లేశ్‌గౌడ్, నాయకులు శ్రీను, శివగౌడ్, జగదీశ్‌గౌడ్, ఉమామహేశ్వర్, యాదగిరి, సదానంద్‌రెడ్డి, చందుయాదవ్, ప్రభాకర్, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేసే పార్టీకే ఓటేయాలి

ప్రచారం నిర్వహిస్తున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల

మలక్‌పేట, ఏప్రిల్ 16: అభివృద్ధి చేసే పార్టీకే ఓటేసి గెలిపించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల ఓటర్లను కోరారు. మంగళవారం పాత మలక్‌పేట డివిజన్‌లోని అజ్జల్‌నగర్, సాలార్ యే మిల్లత్ పార్కు, తీగలగూడ, వాహెద్‌నగర్ తదితర కాలనీల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించిన కరపత్రాలను అందజేసి అభ్యర్థించారు. పాత బస్తీని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్న ఎంఐఎం పార్టీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీకి ఓటేసి గెలిపించాలని కోరారు. మలక్‌పేట ప్రజలకు తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సేవ చేస్తానని, ఎంపీగా ఓవైసీని గెలిపిస్తే పార్లమెంట్ సభ్యుడిగా హైదరాబాద్ నగర సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తుతారని అన్నారు. పాత బస్తీ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్న అసదుద్దీన్ ఒవైసీని మరోసారి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. పాత మలక్‌పేట డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీ, నాయకులు పాల్గొన్నారు.

మానవ హక్కులను పరిరక్షించాలి

ఎల్బీనగర్ , ఏప్రిల్ 16: భారత రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అందరికీ అందుబాటులో ఉండాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ మనోహర్ మూలే అన్నారు. కొత్తపేట మోహన్‌నగర్‌లోని మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యాయన కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల మానవ హక్కుల పరిరక్షణ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యుడు మనోహర్ మూలే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓయూ న్యాయశాస్త్ర ప్రొఫెసర్ జీబీ రెడ్డి, మానసిన వైద్యశాల డాక్టర్ అనిత, జాతీయ మావన హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి, మానస ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ మెర్సీ మధురిమ, కోశాధికారి మధన్‌మోహన్ రెడ్డి, వనజ, గీత, వెంకమ్మ, దినేశ్‌కుమార్, సుబ్బారావు, రామచంద్ర, విష్ణుబట్ల, కృష్ణ చైతన్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించాలి

సైదాబాద్: సమాజంలో వయోవృద్ధులను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మహాసహస్ర అవధాని, టీటీడీ అన్నమాచార్య అళ్వార్ దివ్య ప్రభందం, శ్రీమత్‌భగవత్ గీత ప్రాజెక్ట్ విశ్రాంత సంచాలకులు డాక్టర్ మేడసాని మోహన్ అన్నారు. మంగళవారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలోని ది సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ (సైదాబాద్–సౌత్‌జోన్) ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'ఇతిహాసాల్లో పితామహుల స్థానం– నేటి సమాజంలో వారి ప్రాధాన్యం' అనే అంశంపై ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామ్మోహన్‌కు ఉగాది పురస్కారం

ఆర్కేపురం, ఏప్రిల్ 16 : వివిధ సామాజిక రంగాలలో సేవలు అందిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ధరణి అధ్యక్షుడు కోట్ల రామ్మోహన్‌కు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారం అందజేశారు. ఈ పురస్కారాన్ని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీసుధ అందజేశారు.

108 సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు. ఏప్రిల్ 16 : 108 సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా పొగ్రాం మేనేజరు శ్రీకాంత్ తెలిపారు. మండల కేంద్రంలో గల 108, 102 అంబులెన్స్‌లను పరిశీలించారు. సిబ్బంది పని తీరు ఆక్సిజన్ సరఫరా, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన సిబ్బందికి పలు సూచనలు సహలు ఇచ్చారు. జిల్లా కో ఆర్డినేటరు రాంబాబు, ఈఎంటీ కుమార్, ఫైలెట్ యాదయ్య, కుమార్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల ఓట్ల కోసమే మజ్లిస్ కొత్త నాటకం

సైదాబాద్, ఏప్రిల్ 16 : పాతబస్తీ మైనార్టీ ప్రజల ఓట్ల సానుభూతి పొందటం కోసం మజ్లిస్ పార్టీ నాయకుడు కొత్త నాటకానికి తెరలేపాడని హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి కొంపల్లె మాధవీలత అన్నారు. ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త కాపు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సైదాబాద్ డివిజన్ పరిధిలోని శ్రీవీరాంజనేయ ఆలయం నుంచి శంకేశ్వర బజార్ ఆలయం వరకు నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్న సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తమ సోదరులను అంతమొందించటానికి కుట్రలు జరుగుతున్నాయంటూ కొత్త నాటకం మొదలు పెట్టారన్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

కళ్యాణ్ (ఫైల్)

సైదాబాద్, ఏప్రిల్ 16 : డ్యూటీకి వెళ్లిన ప్రైవేట్ ఉద్యోగి అదృశ్యమైన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల గుర్జకుంటకు చెందిన సుంచు నర్సవ్వ కుమారుడు కళ్యాణ్ కళ్యాణ్ ప్రైవేట్ ఉద్యోగి. శుక్రవారం ఉదయం డ్యూటికి వెళ్లి తిరిగిరాలేదు. తల్లి నర్సవ్వ ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సింగరేణికాలనీలో...

సైదాబాద్: బాలిక అదృశ్యమైంది. సైదాబాద్‌లోని సింగరేణికాలనీలో నివసించే శ్రీశైలం చిన్న కుమార్తె బ్యూటీషన్ కోర్సు నేర్చుకుంటుంది. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రమైన ఇంటికి తిరిగి రాలేదు. తండ్రి శ్రీశైలం ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మన్సూరాబాద్: ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్బీనగర్, ఎస్‌బీహెచ్‌కాలనీకి చెందిన హరి రవికుమార్ ప్రైవేటు ఉద్యోగి, మంగళవారం ఉదయం ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నాడు. క్రిప్టో కరెన్సీలో పెట్టిన పెట్టుబడుల్లో పెద్ద ఎత్తున నష్టాలు వచ్చాయని, ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తన భర్త ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని మృతుడి భార్య అద్వైలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్‌తోనే ప్రపంచం మనవైపు చూస్తోంది

జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు

హయత్‌నగర్, ఏప్రిల్ 16 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్పతనంతోనే ప్రపంచం భారత దేశంవైపు చూస్తోందని ఆర్టీసీ సంస్థ గ్రేటర్ హైదరాబాద్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు కొనియాడారు. హయత్‌నగర్ డిపో–2లో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డైరెక్టర్ వెంకటేశ్వర్లు, హైదరాబాద్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్రీనివాస్, హయత్‌నగర్ సహాయ రీజినల్ మేనేజర్ సుచరిత హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హయత్‌నగర్ డిపో–1 మేనేజర్ విజయ్, డిపో–2 మేనేజర్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిపై కేసు

సైదాబాద్, ఏప్రిల్ 16 : పాలస్తీనా గాజా పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం...సయ్యద్ అయూబ్ అలియాస్ చందా అనేక వ్యక్తి హైదరాబాద్ యూత్ కరేజ్ అనే సంస్థ ద్వారా పాలస్తీనా గాజా ప్రజలకు సహాయం చేద్దామంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ డబ్బులు వసూలు చేసి ప్రజలను మోసం చేస్తుండటంటూ సైదాబాద్‌కు చెందిన న్యాయవాది సాయి కిశోర్ మూడు రోజుల క్రితం సైదాబాద్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు సయ్యద్ అయూబ్‌పై కేసు నమోదు చేసి ఎస్ఐ శివ శంకర్ దర్యాప్తు చేస్తున్నారు.

బూత్ కమిటీలే కీలకం

వనస్థలిపురం, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల్లో బూత్ కమిటీల పాత్ర కీలకమని బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బూత్ కమిటీల సమావేశాన్ని సోమవారం కార్పొరేటర్ లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో వెళ్లి ప్రజలను కలవాలన్నారు. బీజేపీ ప్రచారం ప్రతి ఇంటింటికీ తీసుకువెళ్లాల్సిన బాధ్యత బూత్ కమిటీలపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి కార్యకర్త క్రమ శిక్షణతో పనిచేసి పార్టీని గెలిపించాలని కోరారు.

పంట పొలాల పరిశీలన

కందుకూరు. ఏప్రిల్ 16 : విద్యుత్ సమస్యతో పంట పొలాలు ఎండటం లేదని రంగారెడ్డి జిల్లా విద్యుత్ ఎస్ఈ గోపయ్య తెలిపారు. సోమవారం మండల పరిధిలోని దాసర్లపల్లి తండాకు వెళ్లిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దగ్గరకు గిరిజన రైతులు వచ్చి తమ పంట పొలాలు విద్యుత్ లేక ఎండుతున్నాయని గోడు వినివించుకున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి మంగళవారం తండాకు వెళ్లి గిరిజనుల పంట పొలాలను పరిశీలించారు. జంగు పంట పొలం వద్దకు వెళ్లి పరిశీలించగా విద్యుత్ సమస్య కాదని బోర్లలో నీరు అడుగంటి నడవక పోవడంతో పంటలు ఎండుతున్నాయని ఏఈ గోపయ్య తెలిపారు.

నామమాత్రంగా అవగాహన

బడంగ్‌పేట, ఏప్రిల్16: ఓటరు అవగాహన కార్యక్రమాలను నామ మాత్రంగా చేసి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఎన్నికల అధికారులు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ప్రతి బస్తీలలో, కాలనీల్లో ఓటరు అవగాహన చేయాలన్న నిబంధనలు ఉన్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఓటింగ్ శాతం పెంచడానికి పది మంది మున్సిపల్ సిబ్బందితో ర్యాలీ తీశారు. అధికారి వెంకట్‌రెడ్డిని వివరణ అడుగగా ఐదు నిమిషాలు చాలు అని అన్నాడు.

బాలిక విద్యను ప్రోత్సహించాలి

మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థిక స్వావలంబన సాధించేందుకు బాలిక విద్య ఎంతో అవసరమని ఉమెన్స్ సేఫ్టీ వింగ్ డీఐజీ రమా రాజేశ్వరి అన్నారు. బాలిక విద్యను ప్రోత్సహించినపుడే మహిళల్లో అక్షరాస్యత పెరుగుతుందని తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట అనిబీసెంట్ కళాశాలల 30వ వార్షికోత్సవానికి మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటికి వెలుగు ఇల్లాలు అన్న నానుడి అక్షర సత్యమని, ఇల్లాలు విద్యావంతురాలైతే కుటుంబం బాగుపడుతుందని, మహిళలంతా విద్యావంతులైతే సమాజం బాగుపడుతుందన్నారు. కార్పొనిస్టు శ్రీధర్, అనిబీసెంట్ కళాశాలల కార్యదర్శి డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, దిల్‌సుఖ్‌నగర్,కొత్తపేట కళాశాలల ప్రిన్సిపాళ్లు రాజవల్లి, సృజని తదితరులు పాల్గొన్నారు.

–మలక్‌పేట, ఏప్రిల్ 16: